నమస్తే తెలంగాణ
# జిందగీ 9
కరీంనగర్ | శుక్రవారం 8 డిసెంబర్ 2023 www.ntnews.com


దార్శనిక మహిళ



## హస్తకళల కోసం ఓ అమెజాన్

**హస్తకళలకు** ఆదరణ తగ్గుతున్నది. చవకగా దొరికే వస్తువులు వాటికి ప్రత్యామ్నాయం అవుతున్నాయి. నాణ్యమైన హస్తకళలు మార్కెట్లో అందుబాటులో లేకపోవడం, దళారుల దోపిడి మరొక సవాలు. ఇందుకు ఓ పరిష్కారం కనిపెట్టారు దృష్టి అనే ఆర్ట్ ఆంత్రప్రెన్యూర్. గుజరాత్‌కు చెందిన దృష్టి తన సహచరుడు హరేశ్‌తో కలిసి ఓ ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభించారు. రాష్ట్రంలోని హస్తకళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ఇక్కడ అమ్ముకోవచ్చు. ఓ చిన్న ఆలోచనగా ఆరంభమైన ఈ వెబ్‌సైట్ హస్తకళలే జీవికగా ఉన్నవారికి సరికొత్త ఊపిరి అందిస్తున్నది. తయారీదారులకు, వినియోగదారులకు వారధిగా నిలుస్తున్నది. ఈ ఆన్‌లైన్ పోర్టల్ ప్రభుత్వరంగ సంస్థలతో కూడా ఒప్పందం కుదుర్చుకునే ఆలోచనలో ఉంది. క్రమంగా వివిధ ప్రాంతాల్లోని హస్తకళాకారులు అందరికీ పోర్టల్‌లో చోటు కల్పిస్తామని చెబుతున్నారు దృష్టి. భౌగోళిక గుర్తింపు ఉన్న ప్రతి స్థానిక ఉత్పత్తినీ తమ వేదిక మీదికి తీసుకురావడమే లక్ష్యమని అంటున్నారు. kalahouse.inలో వర్చువల్‌గా అడుగుపెట్టిన ఎవరైనా దృష్టి ప్రయత్నాన్ని అభినందించకుండా ఉండలేరు.

Fashion



## గుండెల్లో తీన్‌మార్!

**కృతి** కర్బంద.. బాలీవుడ్‌లో ఎన్ని సినిమాల్లో అయినా నటించి ఉండవచ్చు గాక. తెలుగువాళ్లకు మాత్రం 'తీన్‌మార్' కథానాయికగానే గుర్తుండిపోయింది. మాడ్రన్ అవుట్‌ఫిట్‌లో ఏకదమ్ ఫిట్‌గా కనిపించే ఈ అందగత్తె.. పెండ్లి కూతురి ముస్తాబులోనూ డాబూదర్పం ఒలకబోస్తున్నది. లెహంగా మీద ఎంబ్రాయిడరీ మెరుపు, ఆర్ట్ సిల్క్ దుపట్టా తళుకు.. అదరహో!



చక్కని ఇల్లు. ఆదరించే భర్త. సరిపడా డబ్బు. ఆనందంగా బతికేందుకు అన్నీ ఉన్నా మనసులో ఏదో వెలితి. బోసినవ్వులను ఒడిలో చూసుకునే భాగ్యంలేదనే బాధ. ఆమె చేతి వంటలు అద్భుతమనీ, ఆమె పెట్టే పచ్చళ్లు అమృతమనీ నలుగురూ చెబుతుంటే.. మనసు మళ్లించుకునేందుకు వాటి అమ్మకమే వ్యాపకం చేసుకుంది. పచ్చళ్ల వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బును పేద పిల్లల చదువుల కోసం ఖర్చు పెడుతున్నది. అలా మునమర్తి బాలా రాయుడు చేతి వంట వందమంది పిల్లల చదువులకు భరోసాగా నిలిచింది. ఆ పచ్చళ్ల అమ్మ తన సేవా ప్రయాణాన్ని 'జిందగీ'తో పంచుకున్నదిలా..

# పచ్చడి వ్యాపారం.. సేవకు ఆధారం



**నాకు** వంట చేయడం సరదా. రకరకాల రుచులు ప్రయత్నించేదాన్ని. మా అమ్మ, అత్తగారు పచ్చళ్లు బాగా పెట్టేవారు. వాళ్ల దగ్గర మెలకువలు తెలుసుకున్నా. నేను పెట్టిన ఊరగాయల్ని ఇచ్చినప్పుడు చాలా బాగుందనీ, తమకూ చేసిపెట్టమని స్నేహితులు అడిగేవారు. కావలసిన దినుసులన్నీ తెచ్చిచ్చేవారు. నేనూ ఓపిగ్గా చేసిచ్చా. అయితే, తరచూ ముడిపదార్థాలు మిగిలిపోయేవి. అదంతా ఎందుకని 'నేనే పచ్చడి పెట్టిస్తా. ఇంత అని డబ్బివ్వండి చాలు' అని అడిగాను. అలా కాస్తోకూస్తో డబ్బు మిగిలేది. వాటిని పేద పిల్లల సాయానికి ఉపయోగించేదాన్ని. బిడ్డలు లేరన్న వెలితిని పూడ్చుకోవడానికి ఇదొక మార్గంగా తోచింది.



### ముందు సంగీతాన్ని ఆశ్రయించా...

మాది కృష్ణా జిల్లా ఉయ్యూరు. నాన్న ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్‌గా పనిచేసేవారు. నా పదో ఏట గుండెపోటుతో చనిపోయారు. సెకండరీ స్కూల్ నుంచి నా చదువంతా హైదరాబాద్‌లోనే జరిగింది. డిగ్రీ పూర్తయ్యాక పెళ్లయ్యింది. మా వారు ప్రశాంత్ రాయుడు. ఆయనకు సెంట్రల్ ఏసీల ప్లానింగ్ బిజినెస్ ఉంది. మేం అప్పట్లో బెంగళూరులో ఉండేవాళ్లం. పది పన్నెండేళ్ల పాటు పిల్లల కోసం ప్రయత్నించాం. ఐవీఎఫ్ సహా రకరకాల ట్రీట్‌మెంట్లు తీసుకున్నాం. ఏదీ ఫలించలేదు. అప్పటికే నాకు నలభై అయిదేళ్లు వచ్చేశాయి. దత్తత తీసుకునే వయసూ కాదనిపించింది. మార్పు కోసం నాకిష్టమైన సంగీతం మీద దృష్టి పెట్టాను. హైదరాబాద్‌లోని ఆంధ్ర మహిళా సభ కాలేజీ నుంచి బీఏ వోకల్ పూర్తి చేశాను. కంచిపీఠంతో పాటు స్కందగిరి, శంకరమఠంలాంటి చోట్ల కచేరీలు ఇచ్చాను. న్యూయార్క్ కూడా వెళ్లొచ్చాను. ఇప్పటికీ ఆసక్తి ఉన్నవారికి ఆన్‌లైన్ క్లాసులు తీసుకుంటాను. ఒక పక్క పచ్చళ్లు, పొడుల తయారీ.. మరో పక్క సంగీత తరగతులు.. ఖాళీ లేకుండా సమయం గడుపుతున్నా.

### అదే సంతృప్తి

తెలంగాణ ఆవకాయ, నువ్వుల ఆవకాయ, పెసర ఆవకాయ, వెల్లుల్లి ఆవకాయ, తియ్య ఆవకాయ, పసుపు పచ్చ ఆవకాయ... ఇలా రకరకాల మామిడికాయ కారాలు పెడతాను. నిమ్మ, గోంగూర, ఉసిరి, టమాటతోపాటు రేగిపండు, వెలగపండు, తియ్యనిమ్మలాంటి వెరైటీ పచ్చళ్లూ చేస్తాను. నల్లకారం, మునగాకు పొడి, అవిసె గింజల పొడిలాంటి ఇరవై రకాలకుపైగా పొడులూ.. టమాట, దోసకాయ లాంటి కూరగాయలను జోడించిన వడియాలూ తయారు చేస్తున్నా. పొడులూ పచ్చళ్లూ కలిపి ఏడాదికి పదిహేను వందల కేజీల దాకా అమ్ముతున్నాను. మా దగ్గర కొనుక్కునే వాళ్లంతా తెలిసిన వాళ్లే. నాతో పాటు మరో అయిదుగురు సిబ్బంది తయారీలో సహకరిస్తారు. మా పచ్చళ్ల తయారీలో గానుగ నూనెలనే వాడతాం. కారం కూడా ప్రత్యేకంగా పట్టించిందే వినియోగిస్తాం. రంగులు, ప్రిజర్వేటివ్స్, టేస్ట్ ఎన్‌హ్యాన్సర్స్ ఊసే లేకుండా జాగ్రత్త పడతాం. ఢిల్లీ, ముంబై, పుణెతో పాటు యూకే, అమెరికా, జర్మనీ, సింగపూర్, హాంకాంగ్‌లకు నా పచ్చళ్లు, పొడులు వెళ్తున్నాయి. ప్రస్తుతం కొత్తిమీర, అల్లం, చింతకాయ, దోస ఆవకాయలాంటి రోజువారీ పచ్చళ్లను కొందరు ప్రముఖుల కోసం ఫ్రెష్‌గా చేసి ఇస్తున్నా.

> మీకు ఓ సంఘటన చెబుతాను. మిత్రుల సూచనతో మేం ఓ ఆటోడ్రైవర్ కూతురుకి చదువు చెప్పిస్తున్నాం. ఆ పాప అప్పటికి మూడో తరగతో, నాలుగో తరగతో చదువుతున్నది. తన బాధ్యతలు మేం తీసుకున్నాం. అప్పటిదాకా యావరేజ్ స్టూడెంట్ అయిన అమ్మాయి, మరుసటి ఏడాది నుంచి తొంభై శాతానికి పైగా మార్కులు తెచ్చుకున్నది. తన మనసులో ఏ మూలనో ఉన్న.. చదువు కొనసాగుతుందో, లేదో అనే అనుమానం తొలగించి, మేమున్నామనే భరోసా కల్పించడమే ఇందుకు కారణం. ఇలాంటి విషయాలు విన్నప్పుడు చాలా సంతోషం కలుగుతుంది. మరింత కష్టపడి పనిచేసి ఇంకా ఎక్కువమందికి సాయం అందించాలన్న ఉత్సాహం వస్తుంది.

### కాదనకుండా..

పదేళ్ల క్రితం ఈ పని మొదలు పెట్టినప్పుడు హైదరాబాద్‌లోని దేవ్‌నార్ ఫౌండేషన్ వాళ్ల అంధుల పాఠశాలలో ఉంటున్న పిల్లల కోసం వాయిస్ రికార్డర్లు, స్పీకర్లు, యూనిఫామ్‌లు, బ్రెయిలీ పుస్తకాలు అందించేదాన్ని. హాస్టల్ అవసరాలకు ఫ్యాన్లు, దుప్పట్లు, ఆడపిల్లల కోసం శానిటరీ న్యాప్‌కిన్ల లాంటివి కొనిచ్చేదాన్ని. కొవిడ్ ముందు వరకూ ఇక్కడ చాలా మంది పిల్లలకు సేవలందించాం. మాడపాటి హనుమంత రావు స్కూల్లో ప్రస్తుతం ఆరుగురు పిల్లలకు మొత్తం ఫీజులు మేమే కడుతున్నాం. వంటవాళ్లు, పనివాళ్లు, ఆటోడ్రైవర్లు.. కాదనకుండా సాయం అడిగినవారినంతా చదివిస్తున్నాం. ఒక సేవా సంస్థకు కూడా పిల్లల చదువుల నిమిత్తం శక్తి మేరకు సేవ చేస్తున్నా. మొత్తంగా చెప్పాలంటే కనీసం ఓ వంద మంది పిల్లలు నా చేతి వంట కారణంగా చక్కగా చదువుకోగలిగారు. ఇన్ని పచ్చళ్లు పెట్టడానికి కొన్ని గంటల నుంచి రోజుల సమయం పడుతుంది. అయినా సరే పదేళ్ల నుంచి ఇదే పని చేయగలుగుతున్నానంటే, పిల్లలకు సాయం అందించడంలో దొరికే తృప్తే కారణం. ఓపిక ఉన్నంత కాలం ఈ సేవ కొనసాగుతూనే ఉంటుంది.

... లక్ష్మీహరిత ఇంద్రగంటి

## పుస్తకాల దోస్తానా!

**పిల్లలతో** ముందుగా అక్షరాలు దిద్దించాలి. ఆ తర్వాత రాయడం నేర్పాలి. కూడబలుక్కుని చదవడం మొదలుపెట్టగానే బొమ్మల పుస్తకాలు పరిచయం చేయాలి. దీనివల్ల వారి పదకోశం పెరుగుతుంది. ఆలోచన విస్తరిస్తుంది. శతాబ్దాల వెనక్కి వెళ్లనవసరం లేదు. ఓ నలభై ఏళ్ల కాలప్రయాణం సరిపోతుంది. సీరియల్స్ చదివేందుకు వారపత్రికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూసిన రోజులవి. పుస్తక పఠనాన్ని దినచర్యలో భాగంగా మార్చుకున్న తరమది. ప్రతి ఊళ్లో గుడి, బడి, దవాఖానతో పాటు గ్రంథాలయం కూడా ఉండేది. రోజులు మారాయి. ఇప్పుడంతా డిజిటల్‌మయం. ఏదైనా అనుమానం వస్తే, నివృత్తి ఎన్‌సైక్లోపీడియాలోని ఏ వాల్యూమ్‌లో ఉందో చూడాల్సిన పన్లేదు. చూపుడు వేలుతో మొబైల్ స్క్రీన్ తడిమితే చాలు. గ్రంథాలు, శాస్త్రాలు.. ఇప్పుడన్నీ డిజిటల్ పుస్తకాల రూపంలో అందుబాటులో ఉంటున్నాయి. కొనాల్సిన ఖర్చు లేదు. మోయాల్సిన బరువు లేదు. దాచాల్సిన శ్రమ లేదు. ఇంకా మాట్లాడితే చదవాల్సిన అవసరం కూడా లేకుండా ఆడియో బుక్స్ వచ్చేశాయి. ఇదంతా సులువుగా కనిపిస్తుందేమో కానీ, ఓ విలువైన అనుభవాన్ని కోల్పోతున్నామని అంటున్నారు నిపుణులు.



పుస్తకం మన చేతిలో ఉన్నప్పుడు కలిగే శ్రద్ధ వేరు, పేజీలను తాకుతూ కాగితపు వాసనతో మమేకమై ఒక్కో అక్షరాన్నీ మనసులో నింపుకొనేటప్పుడు... కలిగే ఫలితం, అనుభూతి డిజిటల్ తెర మీద కదిలిపోయే అక్షరాలు అందించలేవని తేల్చేశారు. ప్రతి పుస్తకం ఓ కనిపించని జీవితాన్నీ, సుదూర లోకాన్నీ కళ్లకు కడుతుందని చెబుతున్నారు. అందుకే తల్లిదండ్రులు ఇప్పటి తరానికి అచ్చు పుస్తకాలను పరిచయం చేయాలని సూచిస్తున్నారు. తప్పక ప్రయత్నిద్దాం. తొలుత ఒక పుస్తకంతో ప్రయోగం మొదలు పెడదాం. తర్వాత ఆ సంద్రంలో మునకలేయిద్దాం.

నగ ధగలు



**ఒకప్పుడు** కాలర్ అనేది అమెరికన్ డాలర్ కంటే విలువైంది. దానిపై సర్వ హక్కులూ మగవాడికే ఉండేవి. కాలర్ ఎగరేస్తూ జెండా ఎగరేసినంత గొప్పగా ఫీల్ అయ్యేవాడు. ఇప్పుడు మహిళల ఫ్యాషన్‌లోనూ కాలర్ ఓ భాగమై కూర్చుంది. డ్రెస్ డిజైనర్లు మెలితిరిగిన కాలర్లతో మ్యాజిక్ చేస్తున్నారు. జువెలరీలోనూ భాగం చేస్తున్నారు. ఊలుతోనో, పూసలతోనో హ్యాండ్ మేడ్ కాలర్ నెక్లెస్ తయారు చేస్తున్నారు. రంగుల హంగులో అవి నవరత్న హారాలతో పోటీపడతాయి. ధర చౌక. ప్రతి సందర్భానికి ఓ హారం కొనుక్కోవచ్చు. మహా తేలిక. ఎంతసేపు ధరించినా చికాకుగా ఉండదు. జపనీస్ పూసలతోనూ అందుబాటులోకి వస్తున్నాయి. కొంత యాంటిక్ లుక్ కూడా తోడవుతున్నది.



# కాలర్ ఎగరేద్దాం



డియర్ జిందగీ



## 'బొమ్మరిల్లు' అమ్మ

మా అమ్మను చూస్తుంటే.. బొమ్మరిల్లు చిత్రంలో నాన్న పాత్ర గుర్తుకొస్తుంది. నేను ఏం తినాలో, ఏ డ్రెస్ వేసుకోవాలో, ఏ చెప్పులు తొడగాలో.. ఒకటేమిటి, ప్రతి విషయం అమ్మే నిర్ణయిస్తుంది. నాకంటూ ఓ వయసు వచ్చింది. మంచిచెడులు తెలుసుకునే పరిణతి ఉంది. అయినా, ఇలా వెంట పడటం కరెక్టేనా? తనవల్ల నా ఆత్మవిశ్వాసం దెబ్బతింటున్నది.

• ఓ పాఠకురాలు

**మీ** అమ్మ అందరు అమ్మల్లాంటిదే. టీవీలో వార్తలు, పత్రికల్లో కథనాలు, అమ్మలక్కల ముచ్చట్లు ఆమెను ప్రభావితం చేస్తుంటాయి. నీ అభిప్రాయాల కంటే నీ భద్రతే తనకు ముఖ్యం. తన ప్రవర్తన కొంత అతిగా అనిపించవచ్చు కానీ, అసహజమేం కాదు. ఆ భద్రతారాహిత్యం తాలూకు ప్రభావాలే ఇవన్నీ. ముందుగా తనను ద్వేషించడం మానేయండి. మనసు విప్పి మాట్లాడండి. మీ ఆవేదనను తప్పక అర్థం చేసుకుంటుంది. కానీ అందుకు కొంత సమయం పడుతుంది. అప్పటివరకూ ఎదురుచూడక తప్పదు. మీరు కూడా ఒక్కసారిగా తిరుగుబాటు జెండా ఎగరేయకుండా.. కొద్దికొద్దిగా తనను మార్చుకునే ప్రయత్నం చేయండి.